సర్వే పూర్తి.. పరిహారం ఏది?



ఊటూర్‌లో ధ్వంసమైన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, నాయకులు(ఫైల్)

- రైతులను నిండా ముంచిన అకాల వర్షాలు
- ప్రభుత్వ సాయం కోసం పడిగాపులు

మానకొండూర్: అకాలవర్షాలు ఆ గ్రామాల రైతులను నిండాముంచాయి. చేతికందిన పంట, వడగళ్లతో పొలాల్లోనే ధాన్యం నేలరాలగా రైతుల ఆశలు ఆవిరయ్యాయి. కొంతమంది రైతులు వరి కోతలు కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అకాల వర్షంతో ధాన్యం కల్లాల్లోనే తడిసి ముద్దవగా కొంతమంది రైతుల ధాన్యం కల్లాల నుంచి కొట్టుకుపోవడంతో రైతుల కంట కన్నీరు ఆగడం లేదు. ఇటు వరిపంట వడగండ్లతో నేలవాలగా కొద్ది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయి డబ్బులు అందుతాయనుకున్న తరుణంలో కల్లాల్లో పోసిన ధాన్యం సైతం తడిసిపోగా రైతులు ఆవేదనకు గురవుతున్నారు. తడిసిన ధాన్యంలో మిల్లర్లు అనధికార కోతతో నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. మండలంలోని ఊటూరు, లక్ష్మీపూర్, లింగాపూర్, రంగపేట, పచ్చునూర్, వేగురుపల్లి గ్రామా ల్లో ఎన్నడూ లేనట్టి వడగళ్ల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.



వడగండ్లకు దెబ్బతిన్న వరిపంట

ఈసారే ఎక్కువ నష్టం

పంటనష్టాన్ని వ్యవసాయాధికారులు అంచనా వేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. వడగళ్లతో మండలంలో గతంలో కంటే ఈసారే ఎక్కువగా నష్ట పోయారు. ఈ యాసంగిలో మొదటిసారి వడగళ్ల వానకు ఏడు వందలు, రెండోసారి 2,600, మూడోసారి 3,500 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. మొత్తంగా ఏడు వేలకుపైగా ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి నివేదిక అందజేశారు.

ప్రకటనలకే పరిమితం

అకాలవర్షాల వల్ల వరిపంట నష్టపోగా, వ్యవసాయాధికారులు మూడు దఫాలుగా పంటనష్టాన్ని సర్వేచేసి నివేదికలు ప్రభుత్వానికి అందజేశారు. వడగళ్లతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాకు వచ్చి ఎకరాకు రూ.10వేలు అందజేస్తామని ప్రకటించినా ఇప్పటివరకు సాయం అందలేదు.

ఐదెకరాల్లో పంట దెబ్బతింది



ఐదెకరాల పొలం ఎకరానికి రూ.30 వేలచొప్పన కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. ఎకరాకు రూ.40 వేల పెట్టుబడి అయింది. ఈసారి చాలాసార్లు మందులు పిచికారీ చేశాను. వడగళ్ల వానలతో గింజలు పొలంలో నేలరాలాయి. పంట చేతికందకుండా పోయింది. నష్టం వివరాలు అధికారులు నమోదు చేసుకున్నారు. ఇప్పటివరకు పరిహారం రాలేదు.

– బండి శ్రీనివాస్,రైతు, ఊటూరు

పంటలను పరిశీలించాం

మండల పరిధిలోని పలు గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షానికి నష్ట పోయిన పంటలను పరిశీలించాం. పంట నష్టం వివరాలను అంచనా వేసి రైతులకు పరిహారం నిమిత్తం జిల్లా అధికారులకు నివేదికను త్వరలో అందజేస్తాం. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు వచ్చినా రైతులకు తెలియజేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంఏవో

చిత్ర కథ

వృథాగా రిఫ్రిజిరేటర్



తిమ్మాపూర్: మండల కేంద్రంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వాటర్ కూలింగ్ యంత్రం రెండేళ్లుగా వృథాగా ఉంటుంది. రిఫ్రిజిరేటర్‌ను వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వేసవి దృష్ట్యా మరమ్మతులు చేయించాలని కార్యాలయానికి వచ్చేవారు డిమాండ్ చేస్తున్నారు. రంజాన్లు ఏర్పాటు చేసినా సరిపడా నీరు ఉండడం లేదని వాపోతున్నారు

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి



బీమా పత్రాలు అందజేస్తున్న ఎస్సై అంజయ్య

రామడుగు: ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రామడుగు ఎస్సై అంజయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం మాధురి టైలర్స్, వీ ఫర్ నీడ్ ఫౌండేషన్, రైజింగ్ సన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణలోని మహిళలకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పత్రాలు అందజేశారు. మహిళలు ఆన్‌లైన్ మోసాలు, గృహహింస, దయం 100పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణ తీసుకున్న మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు మేనేజర్ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ పంజాల జగన్‌మోహన్‌గౌడ్, జిల్లా యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్, ట్రైనర్ మాధవిగౌడ్, నాయకులు చిలుముల రమేష్, జెట్టుపల్లి అనిల్, రేణుక పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చొప్పదండిలో 9న హనుమాన్ నగర సంకీర్తన

చొప్పదండి: పట్టణంలో 9న జరిగే హనుమాన్ నగర సంకీర్తన విజయవంతం చేయాలని హనుమాన్ మాలధారణ భక్తులు కోరారు. శనివారం చొప్పదండిలోని పోచమ్మ గుడి సమీపంలో హనుమాన్ ఆలయం వద్ద మాలధారణ భక్తులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆలయాలను అనుసంధానం చేస్తూ హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నగర సంకీర్తన చేయాలని తీర్మానం చేశారు. ఆసక్తి గల భక్తులు విరాళాలు అందించాలని కోరారు.

ప్రత్యేక పూజలు

చిగురుమామిడి: చిగురుమామిడి శివారులోని శ్రీ పంచముఖాంజనేయస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం స్వామివారికి పంచామృత అభిషేక సహిత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాన్య సూక్త హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గురూజీ హుమేశ్ స్వామీజీ కంకణ పూజా ప్రాముఖ్యత వివరించారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

చొప్పదండి: మండలంలోని రాగంపేటకు చెందిన దీకొండ అంజయ్యను కులం పేరుతో దూషించిన అదే గ్రామానికి చెందిన బాసర వేణి శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. శుక్రవారం సాయంత్రం అంజయ్య మిత్రుడితో కలిసి ఆర్నకొండ నుంచి బైక్‌పై రాగంపేటకు వెళ్లాడు. గ్రామంలోని చౌరస్తాలో కులం పేరుతో దూషిస్తూ బండరాయితో కొట్టాడని అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వీణవంక: మండల కేంద్రానికి చెందిన 108 ఉద్యోగి రిజ్వాన్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. శనివారం ఆయన కుటుంబానికి తోటి ఉద్యోగులు రూ.60వేల ఆర్థిక సాయం అందించారు. రిజ్వాన్ క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసేవాడని కొనియాడారు. కార్యక్రమంలో ఐలవేన కుమార్, ఉన్నారు.

గుండెపోటుతో మాజీ కౌన్సిలర్ మృతి



శ్రీనివాస్(ఫైల్)

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చెట్టి శ్రీనివాస్ (50) గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనివాస్‌కు భార్య పద్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్, వివిధ సంఘాల నాయకులు, తదితరులు సంతాపం తెలిపారు.


తెలంగాణ భరోసా సభ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

హుజూరాబాద్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే తెలంగాణ భరోసా సభకు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఎస్పీ మండలాధ్యక్షుడు బండారి సదానందం కోరారు. శనివారం మాట్లాడుతూ..సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, తదితరులు పాల్గొ న్నారు.

రైతులను ఆదుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

గన్నేరువరం: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, నాయకులు పరిశీలించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా ప్రభుత్వం మద్దతు ధరకే తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. తాలు పేరుతో మిల్లర్లు కోతలు పెడుతున్నారని, రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, మండల నాయకులు కూన మల్లయ్య, వరీబోయిన మల్లయ్య, పబ్బత్ సాగర్‌రెడ్డి, మల్లయ్య, బోయిని అంజయ్య, బుర్ర కనకయ్య, జాలి గోపయ్య పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రసమయిబాలకిషన్



కేశవపట్నం జీపీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మానకొండూర్: పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతన్నాయని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శనివారం మండలంలోని శంషాబాద్ నూతన పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ శేఖర్, సర్పంచ్ రవి, గట్టుదుద్దెనపల్లి సర్పంచ్ సతీష్‌రెడ్డి, గ్రామవార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేశవపట్నం అభివృద్ధికి రూ. కోటి నిధులు

శంకరపట్నం: కేశవపట్నం గ్రామ అభివృద్ధికి రూ. కోటి నిధులు ఇస్తామని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని కేశవపట్నం, కరీంపేట గ్రామ పంచాయతీ, మహిళా సంఘం భవనాలను శనివారం ప్రారంభించారు. అనంతరం కేశవపట్నంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేశవపట్నం రోడ్డు విస్తరణకు నోటీసులు ఇవ్వాలని సర్పంచ్ భర్త తిరుపతికి సూచించారు. రోడ్డు వెడల్పులో పేదలుంటే ఇళ్లు మంజూరు చేసి, ఇంటి స్థలం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. రైతు మార్కెట్ సక్రమంగా నిర్మించలేదని, గ్రామంలో పచ్చదనం లేదని మండిపడ్డారు. గ్రామ పంచాయతీ నిధులు ఎన్ని ఉన్నాయని ఎంపీడీవో బషీరొద్దీన్‌ను ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, చంద్రబాబు ఎన్‌కౌంటర్లు చేసి ఆంధ్రాకే పరిమితమయ్యారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేశవపట్నంలో జీపీ భవనం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వస్తుండగా బీఆర్ఎస్ నాయకులు బాణాసంచా కాల్చారు. నిప్పురవ్వలు ఎగిసిపడటంతో పలువురికి గాయాలయ్యాయి. ఎమ్మెల్యేపై నిప్పురవ్వలు పడకుండా పోలీసులు రక్షణగా నిలిచారు. కేశవపట్నం పురాతన వేణుగోపాలస్వామిని దర్శించుకుని దేవదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి సీజీఎఫ్ నిధులు మంజూరు చేయాలని కోరారు. కేశవపట్నం సర్పంచ్ బండారి స్వప్న ప్రారంభోత్సవానికి గౌర్హాజర్ అయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ వనపర్తి మల్లయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ఎంపీపీ రమేశ్, ఎంపీటీసీలు కవిత, తిరుపతయ్య, విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, ఆలయ చైర్మన్ మల్హారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీరాంశ్యామ్

జమ్మికుంట: క్రీడలు మానసికోల్లాసం, శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయని జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరాంశ్యామ్ అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ టోర్నమెంట్ పోటీల నిర్వహణపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 15, 16, 17వ తేదీల్లో పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌తోపాటు వివిధ రకాల పోటీల్లో 18 నుంచి 35 ఏళ్లలోపు యువతి, యువకులు పాల్గొంటారని, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.13వ తేదీ సాయంత్రం ఐదుగంటల వరకు దరఖాస్తులు అందించాలన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్టును జిల్లా స్థాయికి ఎంపిక చేసి రూ.15 వేల నగదు అందజేస్తామని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో కల్పన, ఎంఈవో విడుపు శ్రీనివాస్, వివిధ శాఖల అధికారలు పాల్గొన్నారు.

కంప్యూటర్ రంగంలో అపార అవకాశాలు

హుజూరాబాద్‌రూరల్: కంప్యూటర్ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు సాధిస్తే ఉద్యోగ అవకాశాలు పొందుతారని ఎన్ఐటీ ప్రొఫెసర్ డా. ఆర్‌వీబీ సుబ్రమణ్యం అన్నారు. శనివారం సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శంకర్ అధ్యక్షతన ఫేసెట్ -2023 నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఫ్యూచరిస్టిక్ ఏరియాస్ ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సదస్సు ముగింపు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కంప్యూటర్ అప్లికేషన్స్‌ను సమగ్రంగా అర్థం చేసుకుంటే చాలా ఉపయోగాలున్నాయన్నారు. రాబోయే రోజుల్లో కంప్యూటర్ రంగాన్ని సైతం పరిమిత స్థాయిలో వినియోగించేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోనున్నాయని తెలిపారు. టీసీఎస్ కొత్త అప్లికేషన్స్ తెస్తున్నారని ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. అనంతరం బ్రైనోవిజన్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బి. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థి ఆసక్తి ఉన్న రంగం ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. ఆచరణాత్మక ప్రయోగాలు విద్యార్థుల నైపుణ్యాలు, వృత్తిపర అభివృద్ధికి ఉపయోగపడుతాయన్నారు. సదస్సులో దాదాపు 207 సాంకేతిక వ్యాసాలు(టెక్నికల్ పేపర్స్) వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధ్యాపకులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంద్రనీల్, కాన్ఫరెన్స్ కో కన్వీనర్స్ డా.డి. సునీత, ఇ.ప్రదీప్, రిజిస్ట్రార్ పి.వెంకటయ్య, అధ్యాపకులు ఉన్నారు.

నైపుణ్యంగల రంగాలను ఎంచుకోవాలి

కరీంనగర్‌క్రైం: నైపుణ్యాలు గల రంగాలను ఎంచుకొని గౌరవప్రదంగా బతకాలని కరీంనగర్ అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) ఎస్. శ్రీనివాస్ అన్నారు. శనివారం పోలీసుశాఖ, సఖీ సెంటర్ సంయుక్తంగా హిజ్రాలతో నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. భిక్షాటనే వృత్తిగా కాకుండా ఏదైన ఉద్యోగం, వ్యాపారం లాంటివి చేసుకోవాలని, ఏదైనా సమస్య వస్తే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అన్నారు. సొసైటీలో గుర్తుంపు ఉండేలా ఏదైన ఉద్యోగాలు చేసుకోవాలని సూచించారు. పోలీసు శాఖ తరఫున కూడా జీవనోపాధి కోసం తమవంతు ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన్ సీఐ బి.శ్రీనివాస్, త్రీటౌన్ సీఐ డి.దామోదర్‌రెడ్డి, సఖీ సెంటర్ కోఆర్డినేటర్ దామెర లక్ష్మి పాల్గొన్నారు.

అమర జవాన్‌కు ఘన నివాళి



మధురానగర్ చౌరస్తాలో అమర జవాన్‌కు ఘన నివాళి

గంగాధర: జమ్మూకాశ్మీర్‌లో హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన జవాన్ పబ్బాల అనిల్‌కుమార్‌కు నివాళి అర్పించడానికి శనివారం మండలంలోని మధురానగర్ చౌరస్తాకు యువకులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. హైదరాబాద్ నుంచి మిల్ట్రీకి చెందిన ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి తీసుకువస్తుండగా మధురానగర్ చౌరస్తాలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు, ప్రజలు ఘన నివాళి లర్పించారు. అనంతరం నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీతో జవాన్ స్వగ్రామం మల్కాపూర్‌కు వెళ్లారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరి

జమ్మికుంట: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో కల్పన ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ రాజేశ్వరి, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరాంశ్యామ్ హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు, నష్టాలను సర్పంచులు, అంగన్‌వాడీ టీచర్లు చొరవతీసుకొని ప్రజలకు తెలియజేయాలన్నారు. రహస్యంగా బాల్య వివాహాలు చేస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలా చేసేవారు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మికి అర్హత కోల్పోతారని, మతపెద్దలు ముందుగా వయస్సు, తదితర వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, హెడ్‌కానిస్టేబుల్ రఘుపతిరెడ్డి, ఎంఈవో శ్రీనివాస్, మత పెద్దలు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న వాకర్స్, తదితరులు

హుజూరాబాద్: హుజూరాబాద్ హైస్కూల్ క్రీడా మైదానాన్ని మినీ స్టేడియంగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించినందుకు శనివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మినీ స్టేడియం ఏర్పాటుతో వాకర్స్, క్రీడాకారులకు సౌకర్యం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, నాయకులు చింత శ్రీనివాస్, తాళ్లపల్లి శ్రీనివాస్, ధనవర్ష రాజు, కుమార్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యుత్ ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాలు, నివారణ చర్యలపై ఏఈ తిరుపతి అవగాహన కల్పించారు. అనంతరం విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది అనూష, రఘుపతి, కొండగట్టు, ఫరూఖ్, ప్రకాశ్, మారుతి, చంద్రశేఖర్, రాకేశ్, శ్రీకాంత్, అమర్, హన్మాన్, శ్రీనుతోపాటు వినియోగదారులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణతో నైపుణ్యం పెరుగుతుంది



కళ్లకు గంతలతో బొమ్మలకు కలర్స్ వేస్తున్న విద్యార్థులు

జమ్మికుంట: ప్రత్యేక శిక్షణ తరగతులతో విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని తహసీల్దార్ రాజేశ్వరి అన్నారు. పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలో స్పార్కిల్ సమ్మర్ ప్రత్యేక శిక్షణ తరగతులు ఏప్రిల్ 22 నుంచి మే 6వ తేదీ వరకు నిర్వహించారు. శనివారం శిక్షణ ముగింపు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థిలో నైపుణ్యం ఉంటుందని శిక్షణ ద్వారా బయటకు తీయవచ్చన్నారు. డ్రాయింగ్, డ్యాన్స్, తదితర కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. సమ్మర్ క్యాంపులో జమ్మికుంట, పెద్దపల్లి, మంథని, రుక్మాపూర్, మానకొండూర్, అల్గునూర్ సాంఘిక సంక్షేమ, మద్రిమడ్ల, ఎల్లారెడ్డిపేట గిరిజన సంక్షేమ విద్యార్థులు సుమారు 185 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కుమారస్వామి, పీపీఎల్ నాయకులు గడప రాజు, అంబాల ప్రభు, స్కూల్ కమిటీ సభ్యులు లావణ్య, సుధాకర్, రజినీకర్, దూడపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులు, సిబ్బంది డిమాండ్లు పరిష్కరించాలి



కార్మికుల సమ్మెలో మాట్లాడుతున్న బొమ్మ శ్రీరాంచక్రవర్తి

చిగురుమామిడి: పల్లెలు పరిశుభ్రంగా ఉండాలంటే గ్రామ పంచాయతీ కార్మికులు, కారోబార్లతోనే సాధ్యమవుతుందని బీజేపీ నాయకుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కారోబార్లు, బిల్‌కలెక్టర్లకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించి రూ. 21వేల వేతనం అందించాలని, ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. అలాగే గ్రామపంచాయతీ లో పనిచేస్తున్న పారిశుద్య కార్మికులను, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రిషియన్స్, ట్రాక్టర్ డ్రైవర్లను ప్రత్యేక హోదా కల్పించి 15వేల రూపాయల వేతనం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి పి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బి వంశీకృష్ణ, కంది శంకర్, కోమటి సత్యనారాయణ, వంగర మల్లేశం, అక్కు శ్రీనివాస్, ఉపసర్పంచ్ మట్ట శ్రీనివాస్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు వెంట ఉన్నారు.

వైద్యులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఈనెల 2న శిశువు మృతి చెందిన ఘటనలో బాధ్యులైన డాక్టర్ అయేషా, సిబ్బంది శ్రీలత, రమ, స్వందనలకు కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్ తెలిపారు. రెండు రోజుల్లో సమాధానం చెప్పాలని నోటీసులో పేర్కొన్నట్లు వెల్లడించారు.